# న్యాయం జరిగింది

కాకాని కమల

"యువర్ ఫాదర్ వెంకటయ్య ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమీడియట్లీ - కోటయ్య" ఆ టెలిగ్రాం చూస్తూనే అదిరిపడ్డాడు రమణ.

"నాన్నా" అన్న ఒక వెర్రికేక అతని గొంతులోంచి బయటికి వచ్చింది.

ఆ కేకకి ఉలిక్కిపడినట్లు అప్పుడే నిద్రకి ఉపక్రమిస్తున్న అతని రూమ్‌మేట్ నరేష్‌తోపాటు పక్క రూములలోని కుర్రాళ్ళు కూడా బిలబిల్లాడుతూ రమణని చుట్టుముట్టారు. రమణ తండ్రి చనిపోయాడన్న వార్త క్షణాల్లో హాస్టలంతా పాకిపోయింది. రమణ మాత్రం దిక్కు తోచని వాడిలా మంచంలో కూలబడిపోయాడు. అతని కళ్ళ నుంచి అవిశ్రాంతంగా నీళ్ళు జారిపోతున్నాయ్.

పాడుచుకు వచ్చినట్లు పక్కటెముకలు కనిపించేలా బక్కచిక్కి, నీరుకావిపట్టిన పంచె, జుబ్బా ధరించి నాగలి కొర్రా భుజాన వేసుకుని పొలం పోయే తండ్రి రూపమే కళ్ళ ముందు కదులుతోంది. వాన పడుతున్నా - ఎర్రని ఎండ కాస్తున్నా అలుపు అన్నది తెలియకుండా ఎంత కష్టం చేసేవాడు నాన్న?

అలాంటి నాన్న చచ్చిపోవడం ఏమిటి?

స్నేహితులు దగ్గరుండి రమ్మని బస్సు ఎక్కించారు.

"పై వారంలో మిడ్‌టర్మ్ పరీక్షలు. ఆఖరి సంవత్సరం చదువు. ఈ సమయంలో తండ్రి పోవడం ఏమిటి? రమణకి కష్టమే వచ్చింది" అనుకున్నారు కదులుతున్న బస్సుని చూస్తూ.

తెలతెల వారుతూంటే ఊళ్ళో బస్సు దిగాడు రమణ.

ఎర్రని మట్టి రోడ్డు దాటి డొంక దారిన ఊళ్ళోకి వచ్చాడు.

అల్లంత దూరం నుంచి తన ఇంటిని చూస్తూ బావురుమన్నాడు రమణ.

ఇంటి ముందు శవం

శవం చుట్టూ తల్లి, అక్కచెల్లెళ్లు, తమ్ముళ్లు, బంధువులు....

దూకినట్లు ఒక్క ఉదుటన ఇంటి ముందుకి వచ్చాడు రమణ. చేతిలో సంచి గిరాటేసి తండ్రి శవం పక్క కూలబడి పోయాడు. పంచనామా కోసం కాబోలు పోలీసులు సిద్ధంగా నిల్చున్నారు. రమణ రాకతో వాళ్ళలో హడావిడి మొదలయ్యింది. అతని కోసమే వాళ్ళు వేచి ఉన్నారు. చాలా మంది మగ పిల్లలు తల్లికి చేరువ అవుతారు. కానీ రమణకి చిన్నప్పట్నుంచి తల్లి దగ్గర కంటె, తల్లి దగ్గరే చేరిక ఎక్కువ. కారణం తల్లి లోకం ఇల్లు-వంట-పిల్లలు-పాడి పశువులు. అంతవరకే. కాని తండ్రి పగలు రేత్తిరి తేడా లేకుండా ఎండావాన అనకుండా ఎద్దులతో సమంగా చాకిరి చేసేవాడు. అలుపు వచ్చిన పుడు గట్టుమీదకి వచ్చి చెట్టు కొమ్మకి వేలాడుతున్న ఉట్టిలోంచి అంబలి కుండ తీసి రెండు చేతుల్తో పైకి ఎత్తి పట్టుకుని మెడ ఎత్తి నోరు తెరిచి ధారగా అంబలి నోట్లోకి పోసుకునేవాడు. గుటుక్కు గుటుక్కుమని నాలుగు పురిసిళ్లు జుర్రుకుని, పంట కాల్వలో చేతులు కడిగి అతడి చేతిని ఒకసారి ముఖానికి రుద్ది "ఉఫ్" అని నిట్టూరుస్తూ తిరిగి పొలంలోకి దిగేవాడు.

"జర్రంత సేపు అట్ట కూసో అయ్యా. ఇప్పుడే గదా అంబలి తాగినవ్" అంటే -

"మనమేమన్నా మహారాజులంరా తిని కూసోటానికి? నీవు పట్నంలో పెద్ద సదువు సదువు. నేను అట్టనే కూచుని తింటాలే" అని నవ్వుతూ నవ్వుతూ ఆ తాగిన అంబలికి తృప్తిగా తేపులు తీస్తూ తిరిగి పొలంలోకి దిగేవాడు.

సకాలంలో వానలు పడకపోతే అగాధంలా ఉన్న మోట బావిలోంచి ఏతం తోడి పంటకు పెట్టేవాడు.

పగలు రాత్రి పొలం పనులు తప్పించి వేరే ధ్యాస లేదు. కాని చివరికి పంట చేతికి వచ్చేసరికి ఫలితం అంతా దళారీలపాలు అవుతుంది. అన్యాయాన్ని ఎదిరించలేడు. న్యాయంగా రావల్సిన దాన్ని కూడా నోరు తెరిచి అడగలేడు. గట్టిగా నిలదియ్యలేడు. చదువు లేదు. పాయింటు మాట్లాడటం తెలియదు.

పోలీసులంటే తగని భయం. దళారీలకి, బ్యాంకు అధికారులకి, ఆఖరికి సొసైటీ క్లర్క్, ప్యూన్‌కి కూడా భయపడతాడు.

అదేమంటే "ఆళ్ళు సదువుకున్నోళ్ళు. నేను అచ్చరం రాని ఒడ్ని. ఆళ్ళు ఏటన్నా మాట్లాడగలరు. ఏందన్నా సెయ్యగలరు. ఆళ్ళతో పితలాటకం ఎందుకు?" అంటాడు.

పది రూపాయలు అప్పు దొరుకుతుందంటే ఆళ్ళు ఎక్కడ వేలి ముద్ర వెయ్యమన్నా వేస్తాడు.

ఇదంతా చూస్తూంటే రమణకి కడుపుమంట.

అందుకే బాగా చదివి పొలంలో బంగారం పండించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఏపని చేసినా శాస్త్రీయ పద్ధతి తెలియకుండా చేస్తే నేలవిడిచి సాము చెయ్యటమే అవుతుంది. కాలం మారింది. సాంకేతిక విజ్ఞానం పెరిగింది. వ్యవసాయరంగాన్ని అవుపోసన పట్టాలన్నంత పట్టుదలతో బి.ఎస్సి అగ్రికల్చర్ చేశాడు. హైద్రాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో చేరాడు. పి.జి. మొదటి సంవత్సరం అయ్యింది. ఆఖరి సంవత్సరం చేస్తున్నాడు.

అటు దళారీల వల్ల ఇటు పొలం వల్ల తండ్రి అప్పులపాలు అయ్యాడని తెల్సింది. చిన్నప్పట్నుంచి సేద్యం అంటే ఇష్టం. బాగా చదివి తండ్రి కష్టాలు తీర్చాలని అతని మనసు ఉరకలు వేసేది. తండ్రిని కూర్చోబెట్టి సుఖపెట్టాలి అనుకున్నాడు. ఆదర్శరైతు కావాలనుకున్నాడు పంచనామాకి తండ్రి శవం వెంట రమణ కూడా వెళ్ళాడు.

తండ్రి ఎండ్రిన్ తాగి మరణించాడు.

అంటే ఆత్మహత్య చేసుకున్నాడు. పంచనామా తప్పదు.

"అసలేం జరిగింది? వెంకటయ్య ఎందుకు ఎండ్రిన్ తాగవలసి వచ్చింది?" మాజిస్ట్రేట్ ప్రశ్న.

* * * *

గుంటూరు జిల్లా దగ్గర ఒక కుగ్రామం వెంకటయ్యది.

ఆరు ఎకరాల బడుగు రైతు.

తెల్లబంగారం మీద మోజున్న రైతు. గత నాలుగేళ్ళ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లా రైతులు పత్తి వేస్తున్నారు. వేసిన మొదటి రెండు మూడు సంవత్సరాలూ రైతులకి పొలాల్లో "పత్తి" పండలేదు బంగారం... తెల్ల బంగారం పండింది.

రైతన్నలు పుట్టి బుద్ధి ఎరిగిన తరువాత అంత డబ్బు ఎన్నడూ కళ్ళ జూడలేదు. పాత అప్పులు పోను ఇంకా చేతిలో డబ్బు మిగిలింది. ఆ పూపుతో వరసగా నాలుగేళ్ళపాటు పత్తే వేశారు. కాని ఆ తరవాత సంవత్సరాలలో కొద్దిగా రాబడి తగ్గింది. ఎకరానికి పది క్వింటాలు దిగిన పత్తి ఆరేడుకి పడిపోయింది. అయినా రైతులకి ఆశ చావలేదు. పత్తి ధర బాగుంది. గత సంవత్సరాలలాగే పొలంలో ఈఏడూ పత్తే వేద్దామా లేక ఇతర పంట ఏదన్నా వేద్దామా అని గుంజాటన పడి చివరికి ప్రకాశం -గుంటూరు జిల్లా రైతులందరూ పత్తే వేశారు. దిగుబడి ఎంతున్నా అసలు గిట్టుబాటు అవుతుందన్న ఆశతో చివరికి వెంకటయ్య కూడా పత్తే వెయ్యటానికి నిశ్చయించుకున్నాడు.

జూలై నుంచి ఆగష్టు నెలాఖరుకల్లా పత్తి నాట్లు ముగిసిపోతాయి.

జూలై నెలాఖరుకల్లా వెంకటయ్య పత్తి నాట్లు ముగించాడు. మూడు ఎకరాల్లో డిసిహెచ్ 32 రకం, మూడు ఎంసియు 5 రకం వేశాడు. మొదటిది పొడుగు రకం పింజపత్తి. రెండోది పొట్టి రకం పింజెపత్తి. ముప్పై నలభై రూపాయల కంటే ఆరెండింటి ధరలో అట్టే తేడా వుండదు. అయితే పరిస్థితులు ముందులా లేవు. ఎటుపోయినా చుక్కెదురే ఉంది.

ఆ జిల్లాలో పత్తికి విపరీతమైన లాభాలు రావడం, రైతులంతా మూడువంతులు మంది పత్తే వెయ్యటంతో

ఆఏటికాఏడు విపరీతంగా పత్తివిత్తనాలకి డిమాండ్ పెరిగింది.

ఒక ఎకరానికి కిలో విత్తనాలు అవసరం అవుతాయి.

ఇంతకుముందు యాభై రూపాయలున్నది ఈ ఏడాది మూడు వందలు అయ్యింది. ఈ డిమాండ్‌తో కల్తీ సరుకు బాగా కల్సింది. అందుకని ముందు జాగ్రత్తగా రైతులంతా తమకి తెల్సున్న దుకాణాల్లో విత్తనాలు కొన్నారు.

వెంకటయ్య కూడా తనకి బాగా తెల్సున్నవాడు, దూరపు బంధువు అయిన రామనరసయ్య కొట్లో కొన్నాడు.

ఆ నెల్లో మంచి వానలు పడటం చేత నేలంతా బురదుంది. కూలీలు కూడా సమయానికి దొరకటంతో మంచి పదునైన సమయంలోనే వెంకటయ్య విత్తనం నాటాడు.

"ఏ పని చేసినా పదును అదును చూసి చేస్తే మంచి ఫలితం ఉంటుంది" అనుకున్నాడు కూడా. అయితే ఆ ఆనందం అట్టే రోజులు నిలవలేదు.

వారం రోజులు గడిచేసరికి రైతుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

పంట సరిగా మొలవలేదు.

కొన్ని విత్తనాలు తలలెత్తి చక్కగా మొలకెత్తాయి. మరి కొన్ని నీలుక్కుపోయాయి.

ఆవిధంగా ఒక్క వెంకటయ్య పొలంలోనే కాదు. చాలామంది రైతుల పొలాలు అదే గతిలో ఉన్నాయ్. ఒక్కొక్క దుకాణం వాడు ఒక్కొక్క పేరుతో నాసిరకం విత్తనాలు అమ్మాడు.

దాంతో రైతులకి ఆ దుస్థితి వచ్చింది.

కాని ధర మాత్రం మేలు రకం మంచి విత్తనాలకి తీసుకునే ధర తీసుకున్నారు. తప్పు ఎవరిదైనా పొరపాటు ఎక్కడున్నా నష్టపోయేది రైతే.

విత్తనాలు అమ్మిన వాళ్ళని శాపనార్థాలు పెట్టుకుని మళ్ళీ "పడి విత్తనాలు" తెచ్చి నాటారు రైతులు. దేముడా అనుకుని నీళ్ళు మోసుకుని మొక్కలకి పెట్టుకున్నారు.

అవీ కొన్ని మొలిచి కొన్ని మొలవక తయారయ్యాయి.

ఊళ్ళో రైతులందరి ముఖాలు వేలాడబడ్డాయి. ఒక్కడిలో కళలేదు. విత్తనాలు సరిగా నాటుకోలేదని కల్తీ జరిగిందని, దొంగవ్యాపారం చేశారనీ రైతులు దుకాణదార్లని అంటే "మీకు నాటుకోటం చాతకాలేదు. పదునులో నాటలేదేమో" అని తిరిగి రైతన్నలతో అన్నారు వాళ్ళు.

"ఇన్నాళ్ళ నుంచి నాటుకోవడం చాతకాకనే సేద్యం చేస్తున్నామా?" అన్న రైతన్నల మాట వల్ల గొడవలై ముఖాలు చెడ్డాయి.

ఇంతలో భారీ వర్షం సూచనలు కనిపించాయ్. రైతాంగం అంతా పంటలకి ఎద పెట్టటానికి ఆయత్తం అయ్యారు.

వెంకటయ్య కూడా ఎద పెట్టాడు.

అమర్నాడే పిలిచినట్టు వాన పడింది. వాళ్ళు కాస్త సంతోషించారు. ఏ ఇతర పంటకు లేని బాధ పత్తి పంటకి ఉంది.

అది విపరీతంగా పురుగు పట్టడం. డబ్బుకి వెనకాడకుండా మందు వాడాల్సిందే - అయితే అక్కడా మోసం జరిగింది.

సంచికి అసలు ధర కంటే మూడు పదులు పైగా తీసుకున్నారు దుకాణాల వాళ్ళు.

అదేమని రైతు నిలదీస్తే - "స్టాకు తక్కువ వుంది. గుంటూరు, ప్రకాశం మొత్తం రైతులు పత్తే వేశారు. ఇలా మందు సంచులు రావటం ఆలీసెం అలా తీసుకెళ్ళి పోతున్నారు. నీకు కష్టంమనిపిస్తే తీసుకోటం మానెయ్యి" అంటున్నారు నిర్లక్ష్యంగా. చేసేది లేక ఎక్కువ ధర పెట్టాడు వెంకటయ్య.

చేతిలో డబ్బు లేదు. కొడుక్కి "టర్మ్" ఫీజులు కట్టాలి. హాస్టల్ బిల్స్ పంపాలి.

రైతులందరితోపాటు వెంకటయ్య సొసైటీ లోన్‌కి (సహకార పరపతి బ్యాంకు) అప్లై చేశాడు. అక్కడుండే అవినీతి అక్కడుంది.

నెల్లాళ్ళు తిరిగే సరికి లోన్ శాంక్షన్ అయ్యింది. వచ్చిన దాంతో ఒకవంతు లంచాలకి, వాళ్ళ చుట్టూ తిరగటానికి పోయింది.

మొక్కలకి అంటు రోగాలు వచ్చినట్టే ఆ సహకార బ్యాంకుకి 'అవినీతి' అనే అంటు రోగం వచ్చింది.

పైగా లోన్ శాంక్షన్ అవ్వాలంటే ఇంకో లిటిగేషన్ ఉంది. వాళ్ళు అమ్మే చౌకరకం మందుల్ని తప్పని సరిగా కొనాలి. లేకపోతే లోన్ శాంక్షన్ అవదు. కాని వాళ్ళు అమ్మే మందులు పొలానికి పనికి రావు.

అయినా రైతులు తప్పని సరిగా ఆ మందులు కొని ఎఫ్.ఎల్.పి.ఒ.ని మార్చుకుని ఆమందులు తక్కువ ధరకి బయట అమ్ముకోవాలి.

విధి లేక రైతులందరూ చేసే పనే అది.

సొసైటి బ్యాంకు లోన్ శాంక్షన్ అవటం అంటే చావుతప్పికన్ను లొట్ట పోయినట్టే. వెంకటయ్యకి లోన్ దొరికింది. కాని ఎఫ్.ఎల్.పి.ఒల మార్పిడి, ఇసీల ఖర్చు, షేరు కేపిటల్ ఇవ్వవలసిన మామూళ్ళు అన్నీ పోనూ చేతిలో మిగిలింది తక్కువే మరి. అయినా చెయ్యగలిగింది, ఆ అవినీతి ఆపే శక్తి రైతన్నకి ఎక్కడిది?

అంతలో దణ దణా రెండు మంచి వానలు పడ్డాయి. ఎదపెట్టడం వల్ల మందులు చల్లడం వల్ల పొలాలు కాస్త పుంజుకున్నాయి.

సెప్టెంబరు గడిచి అక్టోబర్ మాసం రాలేదు. ఉన్నట్టుండి ఫెటిల్లున రైతాంగం గుండెలు గుభేళ్ళుమన్నాయ్.

హాహా కారాలు చేస్తూ దుఃఖంతో గగ్గోలు పెట్టాసాగారు! పురుగు...పురుగు...పురుగు మహమ్మారిలా విపరీతంగా తెల్లదోమ ఆవహించింది. సరిగ్గా పత్తి పంటలు ఏపుగా పెరిగే సమయానికి ఒక్కసారి శత్రుసైన్యం మెరుపుదాడి చేసినట్లు ఈ తెల్లదోమ పత్తి పైరుల మీదే గాక ఊరంత కూడా కమ్ముకొసాగింది. దూదిని సన్నగా ఏకి గాల్లోకి వదిలినట్లు విపరీతంగా తెలదోమ తెట్టలు తెట్టలుగా విజృంభించింది.

రైతుల తొక్కిస లాటతో పురుగు మందుల దుకాణాలు కిటకిట లాడాయి.

ఎకరానికి బస్తానర్రదాకా 28-28-0 ఎరువు పెట్టారు.

మందు చల్లిన రోజు పురుగు చచ్చి తెల్లారేసరికి తిరిగి విజృంభిస్తూంది. మళ్లా పత్తికి దోమపోటు రాకుండా బస్తాలు బస్తాలు డిడిటి తెచ్చి పొలంలో జల్లుతున్నారు. అయినా ఫలితం లేదు. మందులవల్ల చేతులు కళ్లు పుళ్ళు అయిపోతున్నాయ్.

రైతుల చేతుల్లో డబ్బు లేదు. బతుకు వడ్డీల పాలు అయిపోయింది. ఇంట్లో నగానట్రా అన్నీ దుకాణాల కింద తాకట్టుకి పోయాయి.

పొలం ఏపుగా ఉంది. అంతకంటే ఏపుగా పురుగు కులకుల్లాడిపోతూంది. పురుగు చస్తే పత్తి దిగుబడికి ఢోకా లేదు.

వెంకటయ్య ఇల్లు తాకట్టు పెట్టి తెచ్చి జల్లాడు.

రోజులు గడిచి పోతున్నాయి. పురుగు చావలేదు. మందుల దారి మందులది, పురుగు దారి పురుగులది. అయినా ఆశ చావక రైతన్నలు పురుగు మీద అవిశ్రాంత యుద్ధం చేస్తున్నారు. సహజంగా పది లీటర్ల నీటికి 20 మిల్లిమీటర్ల మందు కలపాలి. రైతులు 70-100 మిల్లిలీటర్లు కలుపుతున్నా ప్రయోజనం లేదు. మళ్లీ పైగా కూలీలని పెట్టి పురుగు ఏరిపిస్తున్నారు. అటు మందులకి ఇటు కూలీలకి విపరీతంగా డబ్బు ఖర్చు అవుతోంది. రైతుల అవసరాన్ని అవకాశంగా తీసుకుని పురుగు మందుల్లో విపరీతంగా కల్తీ జరుగుతోంది. ఒక వంత అసలు, మూడు వంతుల కల్తీ. ఈ అవినీతి వల్ల, దోమవల్ల పత్తి రైతులు చావుదెబ్బ తిన్నారు. వారి పొలాలు మట్టి దిబ్బలయినాయి. ఇళ్ళు వాకిళ్ళు నగ నట్రా తాకట్టుకి జమ అయ్యాయి.

నాసిరకం విత్తనాలు, కల్తీ పురుగు మందులు, ఎరువులు, సకాలంలో నీటి సౌకర్యం లేకపోవటం, సాంకేతిక విజ్ఞానం తెలియక పోవడం తగిన సమయంలో సలహా ఇచ్చే దిక్కులేక అవినీతి, లంచగొండితనం... వీటన్నింటి పాలబడి పత్తిరైతు కృంగిపోయాడు.

అతని పొలం దిబ్బ అయింది.

ఏ ఇంట్లోనూ పొయ్యి వెలగలేదు. రైతుని తెల్ల దోమ పిప్పి చేసి వదిలింది.

ఎటు చూసినా శోకాలు.. హాహా కారాలు.

అనష్టానికి తట్టుకోలేక వెంకటయ్య ఎండ్రిన్ తాగాడు. మరి కొందరు ఉరిపోసుకున్నారు.

✳ ✳ ✳ ✳

జరిగింది తెలుసుకొన్న రమణ మనసు ఆవేశంతో కుతకుత ఉడికి పోయింది. తండ్రి శవం కాలి బూడిద అయ్యింది. కాని అతని మనసు కాలుతూనే ఉంది. ఇంకొక్క వారం రోజుల్లో మిడ్‌టర్మ్ పరీక్షలు ఉన్నాయి. కాని ఇప్పుడు రమణకి పరీక్షలు పాసవ్వాలి. పొలంలో బంగారం పండించాలి అన్న ధ్యాస లేదు. తండ్రి చావుకి కారణం అయిన వాళ్ళ మీద పగ తీర్చుకోవాలి. ఆయన ఆత్మకి శాంతి చేకూర్చాలి. అదే ధ్యేయం. తన తండ్రి సహజంగా చనిపోలేదు. మానసిక వ్యథకి గురి అయి మరణించాడు.

అవినీతికి నిలయాలుగా మారిన సహకార పరపతి సంఘాలు, లోపభూయిష్టమైన వాటి ఆర్థిక విధానాలు. విపరీతమైన ధన దాహంతో కల్తీ వ్యాపారం చేసే వడ్డీ వ్యాపారస్థులు. రైతేరాజు, రైతే వెన్నుముక అని నినాదాలు చేసే ప్రభుత్వం రైతుల కష్ట సుఖాలు ఆలోచించక

పోవడం , సకాలంలో చేయూత అందివ్వకపోవటం. తనతండ్రి ఎండ్రిన్ తాగటానికి ఇవన్నీ కారణాలు అయ్యాయి.

పంటతోపాటు ఇల్లు నగనట్రా కోల్పోయి తనకి తండ్రి లేకుండా అయ్యాడు. కాబట్టి తనకి న్యాయం జరిపించా లంటూ రమణ ముగ్గు రికి పిటీషన్ పెట్టుకు న్నాడు.

1.జిల్లా మెజిస్ట్రేట్ కోర్టుకి 2.డిస్ట్రిక్ట్ కలెక్టరుకి 3. వ్యవసాయశాఖ మం త్రికి. తన తండ్రి కొన్న మందుల బిల్లులు, బ్యాంకు ఋణపత్రాలు జిరాక్సు కాపీలు తీయించి పిటీషన్‌తో పంపాడు.

తన తండ్రి లాగే పంట నష్టపోయిన ఊళ్ళో రైతు లందరి దగ్గనా సంతకాలు, వేలి ముద్రలు కూడా తీసుకు న్నాడు.

అవి కాక తన వ్యక్తి గత నష్టాన్ని గురించి రాస్తూ 'ఫోరం' కి కూడా కేసు నమోదు చేశాడు.

కల్తీ వ్యాపారం, బ్లాక్ మార్కెటింగ్ చేసిన పై దుకాణదారులకి లైసెన్సు రద్దుచేసి (అంటే కల్తీ విత్తనాలు, ఎరువులు, మందులు) అర్హత, నిజా యితీ గలగినవారికి లైసెన్సులు ఇప్పించా లని, బ్యాంకు ఋణం ఇవ్వటంలో కూడా అవినీతి జరిగినందున విచారించి తనకి న్యాయం జరిపించాలని, హఠాత్తుగా తన తండ్రి ఆత్మహత్య చేసుకోవటం, ఆస్తి నష్టపోవటం కార ణంగా తన చదువు కుం టుబడిందని, తను ఇం టికి పెద్ద కొడుకుగా తీవ్ర మానసిక వ్యధకి గురి అయ్యానని కనుక త్వరలో విచారించి తనకి న్యాయం జరిపించాలని జిల్లా వినియోగదార్ల సంఘానికి రమణ అర్జి పెట్టుకున్నాడు.

ఒక్క వెంకటయ్యే కాకుండా ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో చాలా మంది పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకోవటంతో ప్రభుత్వం స్పందించింది. జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికమీద రైతులకి న్యాయం జరిపించాలని ఆదేశాలు అందాయి.

ఆ జిల్లా రైతుల స్థితిగతులు విచారించటం కోసం ఒక నిపుణులైన కమిటీని పంపుతున్నామని ఆ కమిటీ నివేదిక అందిన వెంటనే నష్టపోయిన రైతులకి అపరాధ రుసుము అందిస్తామని, అవసరం అయితే బ్యాంకు ఋణాలు, వడ్డీలు రద్దుచేసి ఉచిత సేవలు అందించి నష్టపరిహారం చెల్లిస్తామని నోటిఫికేషన్ జారీ చేసింది.




Vemakoti Seeta Rama Sastry
WRITER A.A.B JAO (Retd)
BAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM


అయినా రైతులు సంతోషించ లేదు.

"సర్కారు పని అంటే మాటలా అన్నా! అదంతా అయ్యేదెప్పుడు మనం బతికి బట్టగట్టేదెప్పుడు?" అని రైతులు నాలిక చప్పరించారు నిస్పృహగా.

కాని అంతకు ముందే రమణ వినియోగదారుల 'ఫోరం'కి వేసిన కేసు తీర్పుకి వచ్చింది, ఇరవైరోజుల్లో.

రమణ కేసు గెలిచాడు. ప్రభుత్వ లైసెన్సు పొందిన దుకాణాల వారి సేవల్లో లోపాలవల్ల అవినీతి వల్ల ఆర్థికంగా నష్టపోవటమే కాక ఫిర్యాది తండ్రి మానసిక వ్యధకి గురి అయి ఆత్మహత్య చేసుకున్నాడని కమీషన్ అభి ప్రాయపడింది.

కల్తీసరుకు అమ్మిన దుకా ణాల లైసెన్సు రద్దు చెయ్యా లని, ఆ గ్రామంలో విద్యావం తుడైన రమణకి ఆ లైసెన్సు ఇప్పించాలని, ఫిర్యాది తం డ్రికి జరిగిన ఆర్థిక నష్టాన్ని ఆ దుకాణాల చేత ఫిర్యాదికి ఇప్పించాలని, బ్యాంకు ఋణం రద్దుచేసి రైతుకి చేయూతనివ్వాలని, కమీషన్ అభిప్రాయపడింది.

ఇవికాక ఫిర్యాది, తండ్రి మరణం వల్ల పడ్డ మానసిక వ్యధకి మూడువేల రూపా యిలు ప్రభుత్వం అపరాధ రుసుం చెల్లించాలని యివన్నీ వెంటనే అమలు జరపాలని కమీషన్ తీర్పు ఇచ్చింది.

తండ్రి పోయిన అంత దుఃఖంలోనూ రమణకి ఒక విషయంలో కొంత ఊరట కలిగించింది. తన నుంచి తండ్రి ఆశించినదానిలో కొం తైనా సాధించగలిగినందుకు.

నష్ట పరిహారం వచ్చినం దుకు కాదు. పొలంలో బంగారం పండించలేకపోయినా తన చదువు తనకి న్యాయం జరిపించాలని అడిగే ధైర్యాన్ని అన్యాయాన్ని ఎదుర్కొనే సాహసాన్ని ఇచ్చినందుకు!

ఫోరం సామాన్యుడి వెన్ను కాచినందుకు! ❑